క్లుప్తంగా

సత్యదేవుని దర్శించిన హైకోర్టు న్యాయమూర్తి



సత్యదేవుని సన్నిధిలో జస్టిస్ మన్మథరావుకు సత్యదేవుని చిత్రపటాన్ని అందజేస్తున్న ఏఈఓ

అన్నవరం: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావు బుధవారం రాత్రి రత్నగిరిపై సత్యదేవుని దర్శించి, పూజలు చేశారు. ఆయనకు ఆలయం వద్ద పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేద పండితులు వేదాశీస్సులు అందజేశారు. స్వామివారి ప్రసాదాలను ఏఈఓ కృష్ణారావు సమర్పించారు.

ఘనంగా శిఖర పునః ప్రతిష్ఠ



రమా సత్యనారాయణస్వామి ఆలయ శిఖర ప్రతిష్ఠ నిర్వహిస్తున్న భక్తులు

గోకవరం: రమా సత్యనారాయణస్వామి పునః ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. మూడు రోజులుగా ఆలయంలో శిఖర పునః ప్రతిష్ఠ, మహా కుంభాభిషేకం పూజలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం శిఖర ప్రతిష్ఠ నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆరవిల్లి సీతారామాచార్యులు, వల్లూరి జగన్నాథశర్మ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చరణ మధ్య విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్‌రావు, పద్మావతిదేవి దంపతులు ఉదయం 8.23 గంటలకు శిఖరాలు ప్రతిష్ఠించారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిపారు. గురువారం మహా కుంభాభిషేకం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

9న అంబేడ్కర్‌పై నాటక ప్రదర్శన



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఏలూరులో వచ్చే నెల 9న అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని, ఆయన జీవిత వృత్తాంతాన్ని వివరిస్తూ హైదరాబాద్ అభ్యుదయ ఆర్ట్ అకాడమీ వారి నృత్యరూప నాటక ప్రదర్శనను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకుడు రొంగల ఈశ్వరరావు కోరారు. బుధవారం స్థానిక కృష్ణుడి గుడి సెంటర్‌లో యువ శక్తి యూత్, జై భీమ్ యూత్ సౌజన్యంతో సీఐటీయూ గ్రామ కమిటీ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ రొంగల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నేత దాడిశెట్టి చక్రధర్ చేతుల మీదుగా వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.శివ, ఆర్.చంద్రమౌళి, ఎస్.మధు, ఎ.వీరబాబు, చంటి, జి.అర్జున్, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన టెన్త్ పరీక్షలు

కిర్లంపూడి: పదో తరగతి పరీక్షలు బుధవారంతో ముగిశాయి. ఈ నెల 18న ప్రారంభమైన ఈ పరీక్షల కోసం కిర్లంపూడి, బూరుగుపూడి, తామరాడ, జగపతినగరం ప్రభుత్వ పాఠశాలల్లో ఐదు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. బుధవారం పరీక్షకు మొత్తం 1,038 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 1,002 మంది రాశారు. మొత్తం 36 మంది గైర్హాజరైనట్టు ఎంఈఓ టి.జోషఫ్ తెలిపారు.

గండేపల్లి: పదో తరగతి పరీక్షలు బుధవారంతో ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని తాళ్లూరు, మల్లేపల్లి, గండేపల్లిలో కేటాయించిన పరీక్ష కేంద్రాల్లో 532 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉంది. మొత్తం 507 మంది పరీక్షలు రాశారని, 25 మంది గైర్హాజరైనట్టు ఎంఈఓ కేహెచ్ నాయక్ తెలిపారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కృష్ణశేఖర్



తుని బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

తుని: తుని బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సలుగు కృష్ణశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం పట్టణంలోని దివాణం వీధిలోని కోర్టులో బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా కృష్ణశేఖర్, ఉపాధ్యక్షుడిగా యనమల సత్యనారాయణ, కార్యదర్శిగా మేడిది గణేష్, సహాయ కార్యదర్శిగా చిట్రా రాజేష్, కోశాధికారిగా సాకా సత్తిబాబు, లైబ్రరీ కార్యదర్శిగా నారాయణాచార్యులు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా జేవీ రమణమూర్తి, మహిళా రిప్రజెంటేటివ్‌గా పి.కరుణశ్రీని ఎన్నుకున్నారు. వీరిని సీనియర్ న్యాయవాదులు వసంతల అప్పారావు, భీమనాధుల రమణ, ఆగంటి వెంకటరాజు, రేస్ వెంకట్రావు, సీహెచ్ బాలాజీ, బోణం చినబాబు, కాలిబోయిన సూరిబాబు, సీహెచ్ రమణ, బర్ల రవికుమార్ అభినందించారు.

వసూళ్లేవీ!



తుని మండలంలోని మేజర్ పంచాయతీ ఎస్.అన్నవరం

- కలెక్షన్‌పై ఎలక్షన్ ఎఫెక్ట్
- నూరు శాతం ఆస్తి పన్ను వసూలు అనుమానమే..
- ఎన్నికల వేడితో మందగించిన ఆదాయం
- పెద్దాపురం డివిజన్‌లో 38 గ్రామాల్లోనే వంద శాతం

తుని రూరల్: గ్రామాల అభివృద్ధికి ప్రధాన ఆర్థిక వనరులు ఆస్తి పన్నులే. గృహ, గృహేతర ఆస్తి పన్ను వసూళ్లు మందకొడిగా సాగుతున్నాయి. ఇప్పటికే ప్రారంభమైన సార్వత్రిక ఎన్నికల వేడి గ్రామాల్లో ఆస్తి పన్ను వసూళ్లపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కొద్ది రోజుల్లో 2023–24 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నప్పటికీ, వంద శాతం ఆస్తి పన్ను వసూలయ్యే సూచనలు కానరావడం లేదు. కాకినాడ జిల్లాలో కాకినాడ, పెద్దాపురం రెవెన్యూ డివిజన్లు ఉన్నాయి. కాకినాడ డివిజన్‌లో తొమ్మిది మండలాల పరిధిలో 172 పంచాయతీలుండగా, 60 పంచాయతీల్లో వంద శాతం పన్నుల వసూళ్లు జరిగాయి. పెద్దాపురం డివిజన్‌లో 11 మండలాల పరిధిలో 213 పంచాయతీలుండగా, 38 పంచాయతీల్లో వంద శాతం పన్నులు వసూళ్లయ్యాయి. డివిజన్ల వారీగా బుధవారం సాయంత్రానికి పెద్దాపురం డివిజన్‌లో రూ.16,94,33,666కు రూ.12,35,66,568 (72.95 శాతం) వసూలు కాగా, ఇంకా రూ.4,58,67,098 వసూలు కావాల్సి ఉంది. కాకినాడ డివిజన్‌లో రూ.42,84,77,493కు 24,32,30,787 (56.80 శాతం) వసూలు కాగా, రూ.18,52,46,706 వసూలు కావాలి. రూ.కోట్లలో ఉన్న గృహేతర పన్నుల వసూళ్లూ నత్తనడకన సాగుతున్నాయి. అన్నిస్థాయిల్లో అధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నారు.

ఇదీ క్షేత్ర స్థాయి పరిస్థితి

గృహ, గృహేతర పన్నుల వసూళ్లు ఆలస్యంగా ప్రారంభించగా, ఈ ఆర్థిక సంవత్సరం ముగింపు దశలో సార్వత్రిక ఎన్నికల వేడి మొదలు కావడం తీవ్ర ప్రభావం చూపింది. పన్ను చెల్లించాలని గట్టిగా డిమాండ్ చేస్తే, ఎన్నికల వేళ రాజకీయ ఒత్తిళ్లు ఎదుర్కోవాల్సి వస్తుందన్న భయంతో సిబ్బంది వెనకడుగు వేస్తున్నారు. ఫలితంగా వంద శాతం వసూళ్లలో పంచాయతీలు వెనకబడ్డాయి. ఎన్నికల ప్రభావం జూన్ నాలుగు వరకూ ఉంటుంది. అప్పటికి ఈ ఆర్థిక సంవత్సరం ముగిసిపోగా, వచ్చే ఆర్థిక సంవత్సరం మొదలవుతుంది. ఇప్పుడున్న డిమాండ్ అంతా అప్పటికి పాత బకాయిలుగా మారుతాయి. పాత బకాయిలకు 2024–25 ఆర్థిక సంవత్సరం డిమాండ్‌ను కలిపి వసూళ్లు చేపట్టాల్సి ఉంటుంది. ఆస్తి పన్ను వసూళ్ల జాప్యంతో పంచాయతీల నిర్వహణకు అవసరమైన నిధుల కొరత తలెత్తుతోంది. ప్రధానంగా తాగునీరు, పారిశుధ్య నిర్వహణ, కార్మికుల జీతాల చెల్లింపు భారమయ్యే అవకాశాలూ ఉన్నాయి. ఆస్తి పన్ను వసూళ్లపై క్షేత్ర స్థాయి సిబ్బందితో పాటు, ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

పెద్దాపురం డివిజన్ మండలాల్లో వసూలైన గృహ, గృహేతర ఆస్తి పన్నులివీ..

పెద్దాపురం డివిజన్‌లో మండలాలు	మొత్తం పంచాయతీలు	డిమాండ్ (రూ.ల్లో)	వసూలైనది (రూ.ల్లో)
గండేపల్లి	18	1,24,56,060	87,55,560
జగ్గంపేట	16	1,60,61,772	1,19,60,419
కిర్లంపూడి	19	1,52,26,123	1,09,51,748
కోటనందూరు	17	69,83,592	53,85,802
పెద్దాపురం	23	2,26,94,252	1,67,06,560
ప్రత్తిపాడు	23	1,89,01,460	1,37,95,692
రౌతులపూడి	26	73,64,509	6,25,00,016
శంఖవరం	14	1,35,63,100	94,89,619
తొండంగి	22	2,32,52,702	1,86,91,788
తుని	23	1,85,27,294	1,07,06,400
ఏలేశ్వరం	12	1,44,02,802	1,08,72,964
మొత్తం	213	16,94,33,666	12,35,66,568

నేడు మంత్రి రాజా పర్యటన

కోటనందూరు: మండలంలో రోడ్లు, భవనాల శాఖా మంత్రి దాడిశెట్టి రాజా గురువారం పర్యటిస్తారని ఎంపీపీ లగుడు శ్రీనివాసు బుధవారం తెలిపారు. జగన్నాథపురంలో ఉదయం 8.30 గంటలకు ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుడుతున్నట్టు వివరించారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



తుని పార్కులో అవగాహన కల్పిస్తున్న జన విజ్ఞాన వేదిక సభ్యులు

తుని: యువత ఆరోగ్యంగా ఉంటేనే దేశం ప్రగతి పథం వైపు పయనిస్తుందని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రతినిధి డాక్టర్ ఎన్.సూర్యనారాయణ అన్నారు. బుధవారం సాయంత్రం తుని పట్టణం పాట్టి శ్రీరాములు, గణపతినగర్ పార్కు ఆవరణలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వినియోగంతో జరిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎన్.సూర్యనారాయణ మాట్లాడుతూ మద్యపానానికి, మత్తు పదార్థాలకు యువత బానిసలు కాకూడదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ మద్యం అందుబాటులో ఉంటున్న నేపథ్యంలో యువత జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రభుత్వాలు మద్యపానాన్ని ఆదాయ వనరుగా చూడకూడదని, అవసరమైతే నిషేధం విధించాలన్నారు. పిల్లల నడవడికపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని, అప్పుడే ఆరోగ్యకర సమాజం ఏర్పడుతుందన్నారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు కె.నాగభూషణం, కె.సింహాచలం, తరుణ్, ప్రసాద్, జన విజ్ఞాన వేదిక, మద్యపాన వ్యతిరేక సమితి సభ్యులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోండి : ఆర్‌ఓ



రాఘవపట్నంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌ఓ శ్రీనివాసరావు

రౌతులపూడి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రజలు ఎలాంటి ఒత్తిళ్లకు, తలొగ్గకుండా, స్వేచ్ఛగా, స్వతంత్రంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రత్తిపాడు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం డీజే పురం, సబ్ ప్లాన్ ఏజెన్సీకి చెందిన రాఘవపట్నం, జల్దాం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి అల్లర్లు, అసాంఘిక కార్యక్రమాలు, విద్వేషాలను రెచ్చగొట్టేలా ప్రవర్తించరాదని ప్రజలకు అవగాహన కల్పించారు. ఎవరైనా అటువంటి దుశ్చర్యలకు పాల్పడితే, ఎన్నికల నియమావళి చట్టం ప్రకారం శిక్షార్హులవుతారని హెచ్చరించారు. ఆయన వెంట తహసీల్దార్ విద్యాపతి, వీఆర్‌ఓ డి.వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి సురేష్‌కుమార్ ఉన్నారు.

బ్యాంకు బ్రాంచి ప్రారంభం

తొండంగి: ఒంటిమామిడిలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు 258 బ్రాంచ్‌ను సంస్థ చైర్మన్ టి.కామేశ్వరరావు బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎనిమిది జిల్లాల్లో 257 బ్రాంచ్‌ల ద్వారా సేవలందిస్తున్నామన్నారు. రాజమహేంద్రవరం రీజియన్‌లో త్వరలో మరో ఏడు బ్రాంచ్‌లను ప్రారంభించనున్నట్టు చెప్పారు.

వైఎస్సార్ సీపీ విజయం ఖాయం



ఏలేశ్వరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు, అభ్యర్థి వరుపుల సుబ్బారావు

ఎమ్మెల్సీ అనంతబాబు, పార్టీ నియోజకవర్గ అభ్యర్థి వరుపుల

ఏలేశ్వరం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం ఖాయమని ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్, పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు అన్నారు. పట్టణంలోని 2, 12 వార్డుల్లో బుధవారం వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్ సీపీకే పట్టంగట్టాలన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందజేశారన్నారు. సీఎం జగన్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనించిందన్నారు. పార్టీలు, కులాలకతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌కు పట్టంగట్టి, రాష్ట్ర అభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు సామంతుల హైమావతి, దళే కిషోర్, శిగడం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, సామంతుల సూర్యకుమార్, పైల విజయ్‌కుమార్, కోరాడ ప్రసాద్, సుంకర రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మేమంతా సిద్ధం సభను విజయవంతం చేయండి

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు అన్నారు. సీఎం జగన్ చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్రను పురస్కరించుకుని పట్టణంలో బుధవారం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎన్నికల సందర్భంగా చేసిన ప్రజా సంకల్పయాత్ర కంటే, మేమంతా సిద్ధం కార్యక్రమం విశేష ప్రజాదరణ పొందుతుందన్నారు. సీఎం జగన్ బస్సు యాత్ర ద్వారా ప్రజల కష్టాలు, సమస్యలు తెలుసుకుంటారన్నారు. ఈ యాత్ర ప్రతి నియోజకవర్గంలో కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శిగడం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, సామంతులు సూర్యకుమార్, పైల విజయ్‌కుమార్, దళే కిషోర్, సుంకర రాంబాబు, కోరాడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎం చేయండి

మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు శంకర్ మల్లిక్



తుని పట్టణం 27వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న శంకర్ మల్లిక్, నాయకులు

తుని: ప్రజలకు సంక్షేమం, అభివృద్ధిని అందించిన జననేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేయాలని, ఇందుకు ప్రజలు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు యువనేత దాడిశెట్టి శంకర్ మల్లిక్ కోరారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని 27వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణితో కలిసి శంకర్ మల్లిక్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ హయాంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. పట్టణంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను రూ.కోట్లు వెచ్చించి కల్పించారన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన మంత్రి దాడిశెట్టి రాజాను మరోసారి అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు చెబుతున్న మాయమాటలను నమ్మవద్దన్నారు. ఈ సందర్భంగా శంకర్ మల్లిక్‌కు మహిళలు ఘన స్వాగతం పలికారు. తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కలిదిండి సత్యనారాయణరాజు, పట్టణ శాఖ పార్టీ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, గాంధీ సత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కె.రూపాదేవి, జేసీఎస్ కన్వీనర్ పామర్తి మహేష్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయానికి శంకుస్థాపన



జగ్గంపేటలో పార్టీ కార్యాలయానికి శంకుస్థాపన చేసిన తోట నరసింహం

జగ్గంపేట: వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ పార్టీ కార్యాలయ నిర్మాణానికి స్థానిక బాలాజీ నగర్‌లో ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా తోట నరసింహం మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా పార్టీ కార్యాలయ నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టి అందుబాటులోకి తెస్తామని చెప్పారు. నియోజకవర్గంలోని నలుమూలల నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు తరలి వస్తున్న తరుణంలో, వారికి ఇబ్బంది లేకుండా చేయాలని ముందు తాత్కాలిక నిర్మాణం చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో యువ నేత తోట రాంజీ, వైఎస్సార్ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా, జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ అధ్యక్షుడు గఫూర్, క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జాన్‌వెస్లీ, పార్టీ మండల అధ్యక్షుడు రావుల గణేష్ రాజా, నాయకులు జగాల్, రఘు, కాపారపు ప్రసాద్, కరుటూరి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి జగనన్నకే సాధ్యం

వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి తోట నరసింహం సతీమణి వాణి



యర్రంపాలెంలో మహిళలతో మాట్లాడుతున్న తోట వాణి, శ్రీనిధి

గండేపల్లి: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి జగనన్నకే సాధ్యమని వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి తోట నరసింహం సతీమణి వాణి అన్నారు. యర్రంపాలెంలో కోడలు శ్రీనిధితో కలిసి బుధవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఆయా పథకాలు నిరాటంకంగా కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, పార్టీ మండల అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ రామకుర్తి మూర్తి, పి.నాయకంపల్లి, ఎస్టీ రాజాపురం, యర్రంపాలెం, గ్రామ జేసీఎస్ కన్వీనర్లు మలిరెడ్డి పాపారావు, తాళ్లూరి కృష్ణ, నిమ్మల శ్రీహరి, పార్టీ నేతలు తుల రాము, గొల్లేపిల్లి రవి, సానిపిని తారకం, ముత్యాల రవి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయండి



వి.వెంకటాపురంలో సంక్షేమ పథకాలను మహిళలకు వివరిస్తున్న వరుపుల సుబ్బారావు



శంఖవరంలో పార్టీలో చేరిన వారితో వరుపుల సుబ్బారావు

వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి వరుపుల సుబ్బారావు

శంఖవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి తమకు ఓటు వేసి గెలిపించాలని వైఎస్సార్ సీపీ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి వరుపుల సుబ్బారావు అన్నారు. బుధవారం ఎస్.జగ్గంపేట, వి.వెంకటాపురంలో గ్రామాల్లో ఎంపీపీ పర్వత రాజుబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకూ వైఎస్సార్ సీపీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాల కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ శ్రేణులు కష్టించి పని చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. టీడీపీ కూటమి తప్పుడు ప్రచారాలు చేస్తూ, ప్రజలను మభ్యపెడుతోందన్నారు.

వైఎస్సార్ సీపీలోకి వంద మంది చేరిక

శంఖవరం, ఎస్.జగ్గంపేట, వి.వెంకటాపురం గ్రామాలకు చెందిన అనేక మంది బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఎంపీపీ పర్వత రాజుబాబు ఆధ్వర్యంలో వంద మంది టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి వరుపుల సుబ్బారావు కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌లు బైరా ఉప్పారావు, ఈగల విజయదుర్గ, వైస్ సర్పంచ్ మోకిరెడ్డి సురేష్, పార్టీ నాయకులు ఈగల అప్పారావు, పర్వత వివేక్, ఆచంట వెంకటేశ్వరరావు, గింజాల కొండబాబు, ఎడ్ల సత్యనారాయణ, మోకిరెడ్డి రత్తాలు పాల్గొన్నారు.

దొరబాబుకు ఘన సన్మానం

ఏలేశ్వరం: వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన బెహరా దొరబాబును పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు, పార్టీ యువనేత వరుపుల సూరిబాబు బుధవారం ఘనంగా సన్మానించారు. లింగంపర్తిలో బుధవారం వరుపులను దొరబాబు దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. వరుపుల మాట్లాడుతూ కష్టపడి పనిచేసే వారికి పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందన్నారు.

పక్షులకు విడిదిల్లు



పక్షుల కోసం నీరు పోస్తున్న ఉమర్ ఆలీషా



పీఠం తోటలో పక్షుల కోసం ఏర్పాటు చేసిన ఆహారం





తొట్టెలో నీటితో దాహాన్ని తీర్చుకుంటున్న పక్షులు

పిఠాపురం: ఎండలు మండుతున్నాయి. పక్షులకు ఆహారం, నీరు దొరకడం కష్టంగా మారింది. మాకు ఆహారమిచ్చి, దాహార్తిని తీర్చండంటూ పక్షులు వేడుకొనే రోజులొచ్చేశాయ్. చెట్లు నీటి చెలమలు ఎండిపోయి, పక్షులకు ఆహారం, నీరు అందని పరిస్థితుల్లో.. కొందరు మహానుభావులు వాటికి అన్నీ అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీవిశ్వవిజ్ఞాన విద్యా, ఆధ్యాత్మిక పీఠాధిపతి ఉమర్ ఆలీషా స్థానిక పీఠం ఆవరణలో పక్షులకు చలివేంద్రం నెలకొల్పారు. ప్రత్యేకంగా తొట్టెలు ఏర్పాటు చేసి, నీరు, ఆహారం పక్షులకు అందుబాటులో ఉంచారు. ఎక్కడెక్కడి నుంచో పక్షులు వచ్చి, తమ ఆకలి దప్పికలను తీర్చుకుని.. కిలకిలా రాగాలు పలుకుతున్నాయి.

ఎస్‌బీఐ జగపతినగరం బ్రాంచి ప్రారంభం

కిర్లంపూడి: ప్రజలకు ఎస్‌బీఐ ద్వారా మెరుగైన సేవలు అందిస్తున్నట్టు సంస్థ ఆర్‌ఎం మొతుకు సురేష్‌బాబు అన్నారు. జగపతినగరంలో బుధవారం బ్యాంక్ నూతన బ్రాంచిని ప్రారంభించారు. కిర్లంపూడి, పరిసర ప్రాంతాల ప్రజలు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఉమ్మడి ప్రభుత్వం రావాలి

తుని రూరల్: రాష్ట్రంలో టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం రావాలని, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని శాసన మండలిలో ప్రతిపక్ష నాయకుడు యనమల రామకృష్ణుడు, కాకినాడ ఎంపీ ఉమ్మడి (జనసేన) అభ్యర్థి తంగేళ్ల ఉదయశ్రీనివాస్ అన్నారు. బుధవారం తేటగుంటలో రామకృష్ణుడు, యనమల దివ్య, కార్యకర్తలను ఉదయశ్రీనివాస్ కలుసుకున్నారు.